

సీఎం జిల్లా పర్యటన రద్దు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం నిర్మల్ జిల్లా పర్యటన అనివార్య కారణాల వల్ల రద్దయినట్లు డీసీసీ అధ్యక్షుడు కె. శ్రీహరి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పార్టీల హోరాహోరీ..

- పోటాపోటీగా టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం
- సాధారణ ఎన్నికలకు దీటుగా ప్రచార జోరు
- వేగం పెంచుతున్న బీజేపీ, దీటుగా కాంగ్రెస్
- గట్టిపోటీనిస్తున్న స్వతంత్రులు

నిర్మల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారాలు చేపట్టాయి. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పర్వం రోజు రోజుకూ పతాకస్థాయికి చేరుకుంటోంది. హోరాహోరీగా సాగుతున్న ఈ ఎన్నికలు ఇటు కాంగ్రెస్ అటు బీజేపీలకు ప్రతిష్ఠాత్మకంగా మారుతుండడమే కాకుండా స్వతంత్ర అభ్యర్థులకు సైతం ఈ ఎన్నిక సవాలుగా మారుతోంది. ఇందులో భాగంగానే సామాజిక వర్గం వ్యవహారం కూడా తాజాగా తెరపైకి వస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారమే హాట్ టాపిక్‌గా మారింది. ఇటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటుండడంతో తమ రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలను రంగంలోకి దింపి ప్రచార పర్వాన్ని ఉధృతం చేస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు తమ అభ్యర్థులను రంగంలోకి దింపి భవిష్యత్ రాజకీయ ఎదుగుదలకు ఈ ఎన్నికను వేదికగా చేసుకుంటోంది. ఇందులో భాగంగానే ఆ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డిని అలాగే టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని మల్క కొమురయ్యను బరిలోకి దింపి భవిష్యత్ రాజకీయ ఆధిపత్యం కోసం ఆ పార్టీ తంటాలు పడుతోంది. అయితే ఈ సారి బీఆర్ఎస్ అభ్యర్థులు రంగంలో లేకపోవడం, కాంగ్రెస్ పార్టీ కేవలం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మాత్రమే తన అభ్యర్థిని బరిలో నిలపడంతో ఈ రెండు పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నాయి. వీరికి తోడుగా స్వతంత్రులుగా బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులు సైతం రెండు ప్రధాన పార్టీలకు దీటుగా పోటీనిస్తున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టి పోటీనిస్తున్నారు. ఈయనతో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు కూడా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తూ ప్రధాన పార్టీల అభ్యర్థులకు సవాలు విసురుతున్నారు. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరెత్తుండడంతో టీచర్లు, గ్రాడ్యుయేట్‌లే కాకుండా సాధారణ ఓటర్లు సైతం ఈ ఎన్నికపై ఆసక్తి కనబరుస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులంతా ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ తగ్గేదెలే అన్న చందంగా ప్రచారాన్ని ఉధృతం చేస్తుండడంతో జిల్లా అంతటా సాధారణ ఎన్నికల వాతావరణం నెలకొంటోంది. అభ్యర్థులు పోటాపోటీగా ఫ్లెక్సీ బ్యానర్‌లు, కటౌట్‌లు, పోస్టర్లు, గోడ రాతలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా ప్రచార పర్వాన్ని ఉధృతంగా కొనసాగిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందు కోసం అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఆసక్తికరంగా టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం..

జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. బీజేపీ తరఫున మల్క కొమురయ్య పోటీ చేస్తుండగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి అభ్యర్థులెవరు రంగంలో లేకపోవడం గమనార్హం. అయితే టీచర్ యూనియన్ అభ్యర్థులు మాత్రం బరిలో నిలిచి బీజేపీ అభ్యర్థికి గట్టిపోటీనిస్తున్నారు. పీఆర్‌టీయూ తరఫున మహేందర్ రెడ్డి, ఎస్టీయూ తరఫున మాజీ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డితో పాటు యూటీఎఫ్, టీపీస్సీ తదితర యూనియన్‌లు సైతం తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీల తరఫున కేవలం కొమురయ్య మాత్రమే టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలో నిలవగా ఆయనకు పోటీగా మాత్రం టీచర్స్ యూనియన్స్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇటు ప్రధాన రాజకీయ పార్టీకి టీచర్స్ యూనియన్‌లకు మాత్రమే ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి పోటీ కొనసాగుతోంది. అయితే టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులంతా ఉపాధ్యాయులను ఆకట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తమ అనుచరుల ద్వారా టీచర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పోటాపోటీగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. బీజేపీ తరఫున అంజిరెడ్డి, కాంగ్రెస్ తరఫున నరేందర్ రెడ్డిలు, బీఎస్పీ తరఫున ప్రసన్న హరికృష్ణతో పాటు మరికొంతమంది అభ్యర్థులు గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టి పోటీనిస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు. విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగానే కాకుండా బలమైన బీసీ సామాజిక వర్గం తరఫున ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్నారంటూ అనుచరులు చేస్తున్న ప్రచారానికి భారీ స్పందన లభిస్తుండడంతో గెలుపు పై ధీమా కనబరుస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారంతో పాటు హిందూ సంప్రదాయ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకుంటున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపైనే కాకుండా అధికార పార్టీ అండతో పాటు తన విద్యా సంస్థల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతుపై ఆశలు పెట్టుకుంటున్నారు. కాగా మరికొంతమంది స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారం చేపడుతూ తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొత్తానికి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం గతానికి భిన్నంగా ఎత్తుకు పై ఎత్తులతో సరికొత్త వ్యూహాలతో సాగుతుండడం అంతటా చర్చనీయాంశంగా మారుతోంది. ఈ ఎన్నిక ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రతిష్ఠాత్మకంగా మారిందని అంటున్నారు. కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నిక అద్దం పట్టనుందంటూ బీజేపీ సవాలు విసురుతోంది. ఈ సవాల్‌ను కాంగ్రెస్ స్వీకరిస్తూనే రాష్ట్ర మంత్రులు, సీనియర్ నేతలను రంగంలోకి దింపి నరేందర్ రెడ్డి తరఫున ప్రచారాన్ని చేపడుతోంది. బీజేపీ సైతం భవిష్యత్ రాజకీయాలకు ఈ ఎన్నికను వేదికగా చేసుకుంటూనే మరింత బలపడాలని ప్రయత్నిస్తోంది.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రత్యేక పూజలు చేస్తున్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలు ఆదివారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిద్దరిని గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. హనుమాన్ విగ్రహాలతో పాటు ఇతర ప్రధాన విగ్రహాలు, ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, అల్లోల మురళీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, మాజీ ఎంపీపీలు ద్యావతిసుజాత పోశెట్టి, కేశం లక్ష్మీ రమేష్, మాజీసర్పంచ్‌లు అడిచెర్ల రవికుమార్, ద్యావతి పోశెట్టి పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన ఎమ్మెల్యే ఏలేటి

సోన్ : సోన్ మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి అలాగే లోకల్ వెల్మల్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ధ్వజ, శిఖర ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారగంగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నరికెల గంగన్న, నరేష్, నర్సారెడ్డి, నర్సయ్య, రాజేశ్వర్, సంతోష్, ప్రశాంత్, గంగన్న, సాయన్న, మక్కన్న, మత్యత్, రాజు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు


ముథోల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు మొత్తం 4,210 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 4,276 మందికి గాను 2,2033 బాలురు, 2,177 బాలికలు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచే ఆయా గ్రామాల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు విద్యార్థులు తమ పోషకులతోని పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పరీక్షా కేంద్రంలో 590 విద్యార్థులకు గాను 574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ చీఫ్ సూపరిండెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ వ్యవహరించినట్లు వివరించారు. అలాగే జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 236 మంది విద్యార్థులకు గాను 234 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరిండెంట్ అమృత తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శిరీష వ్యవహరించినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగాయి. ముథోల్ ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల్లో 521 మంది విద్యార్థులకు గాను 508 మంది విద్యార్థులు హాజరు కాగా, 13 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందే హాజర్యారు. ఆరుబయట 144సెక్షన్ అమలులో ఉంచారు.

ఆర్‌టీసీ ఉద్యోగుల పనితీరుపైనే సంస్థ భవితవ్యం

- ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్


బహుమతులు ప్రదానం చేస్తున్న రీజనల్ మేనేజర్ సోలోమన్

భైంసా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) ప్రతికూల పరిస్థితులను అధిగమించి సంస్థను ప్రగతి బాటలోకి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత ఆర్‌టీసీ ఉద్యోగులపైనే ఆధారపడి ఉందని ఆ సంస్థ ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ సోలోమన్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు సంస్థ ఉద్యోగులకు భైంసా బస్సు డిపోలో నిర్వహిస్తున్న పవర్ ట్రెయినింగ్ కార్యక్రమంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ఆర్‌టీసీ ఉద్యోగులందరూ బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో విధులను నిర్వర్తిస్తూ సంస్థ పురోభివృద్ధికి నిబద్ధతతో పాటు పడాలని పిలుపునిచ్చారు. సంస్థ మనుగడ ప్రయాణీకులపై ఆధారపడి ఉన్న దృష్ట్యా వారికి అనుకూలమైన రీతిలో బస్సు సర్వీసులను నడుపాలన్నారు. ప్రయాణీకుల పట్ల గౌరవ,మర్యాదలతో వ్యవహరిస్తూ వారి అభిమానాలను చూరగొనాలని సూచించారు. సంస్థ మనది అనే భావన పెంపొందించుకొని విధులను నిర్వర్తిస్తూ ప్రయాణీకులు సైతం మనవారు అనే ధోరణితో నడుచుకోవాలన్నారు. ప్రయాణీకులకు అనుకూలమైన సేవలందిస్తూ ఆర్టీసీ ప్రగతికి అంకితమవ్వాలన్నారు. డిపో మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీలో చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులు, చేర్పులకు అనుగుణంగా విధులను నిర్వహించాలన్నారు. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి సంస్థను లాభాల బాటలోకి పయనింప చేయాలని ఆకాంక్షించారు. సంస్థ ఉద్యోగుల పనితీరుపైనే ఆర్‌టీసీ భవితవ్యం ముడి పడి ఉందన్నారు. పవర్ ట్రేయినింగ్‌లో నేర్చుకున్న అంశాలన్నింటిని విధుల నిర్వాహణలో అమలుపరచి సంస్థ పురోభివృద్ధికి అంకితమవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ ఉద్యోగులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందవేశారు. ఇందులో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముథోల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా మండల కేంద్రమైన ముథోల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నరేందర్ రెడ్డికి మద్దతు తెలుపాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతుందన్న విషయాన్ని గమనించాలన్నారు. ప్రభుత్వాన్ని మరింత ఉత్సాహంతో పనిచేసే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రావుల శ్రీనివాస్, గ్రాడ్యుయేట్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువును సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో 1981లో 7వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. అప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయుడు మల్లన్న దంపతులను ఉచిత రీతిన సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

వాడవాడల బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


భైంసాలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ప్రతినిధుల బృందం

భైంసా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌కేంద్రమైన భైంసాలో ఆదివారం బీజేపీ ప్రతినిధుల బృందం వాడవాడల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారపర్వాన్ని చేపట్టింది. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ బండారి దిలీప్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కో కన్వీనర్ కానరోళ్ల ప్రవీణ్, ప్రబారీ పెరుగు నవీన్‌ల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రచారాన్ని చేపట్టాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సి. అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి విజ్ఞప్తి చేశారు. వేకువజాము వేళలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు, బైపాస్ రోడ్డు, ప్రధాన రోడ్డు మార్గాల్లో వాకింగ్ నిర్వహిస్తున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. అక్కడి నుంచి ఓటర్ లిస్టు జాబితా ఆధారంగా పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో కలియతిరిగి పట్టభద్రులను కలుస్తూ ప్రచారాన్ని రాత్రి వరకు అవిశ్రాంతంగా కొనసాగించారు.



భీమన్నగుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు

కడెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం ధర్మాజీపేట్ భీమన్న దేవుడి పండుగ జాతర ఉత్సవాలు ఆదివారం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. స్థానిక భీమన్న గుట్ట వద్ద ఉన్న భీమన్న ఆలయంలో బండారు బసంతం కళ్యాణం జాతర తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. శివసాయి మంత్రోచ్చారణల మధ్య భీమ్న దేవుడి పండుగ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణం

బోథ్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 12వ వార్డులో కొలువుదీరిన మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం పట్టణానికి చెందిన సహకార సంఘం డైరెక్టర్ చెట్ల ఉమేష్ ఈ సందర్భంగా ఆయన తన సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించి ఇస్తామని కాలనీవాసులకు మాట ఇవ్వడం జరిగింది. పట్టణంలోని ప్రధాన వీధులలో మహిళలు మంగళహారతులు చేత బట్టి ఊరేగింపు నిర్వహించారు. అంతేగాక ఆలయం వద్ద అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు వివరించారు. ఇందులో విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ వైద్య, సిహెచ్ బ్రహ్మానందం, పోతారెడ్డి, మంచి గుంట గంగాధర్, రాజు, కూన రాము, కోల గంగయ్య, రమేష్, చింటూ, సురేందర్, లక్ష్మణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

సారంగాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దీని లో భాగంగా మొక్కులను తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద, కరీంనగర్, మెదక్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారికి పెరుగన్నం నైవేద్యంగా సమర్పించి, కానుకలను హుండీలలో వేశారు. భక్తులు జాతకాన్ని సరిచూసుకున్నారు. దీంతో ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినటువంటి భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేష్ అన్ని చర్యలు చేపట్టారు.

'సేవాలాల్ జయంతిని నిర్వహించాలి'

సిరికొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నియోజకవర్గాల కేంద్రాల్లోనే జరపాలని ఆదివారం బోథ్ నియోజకవర్గ బంజారా సంఘం అధ్యక్షుడు ధరావత్ నరేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్‌కు రూ.30 వేలు, బోథ్ నియోజకవర్గానికి రూ.లక్షా 94 వేలు మంజూరు చేసింది. అయితే ప్రతీ సంవత్సరం గిరిజన జనాభా తక్కువగా ఉన్న ఆదిలాబాద్ నియోజకవర్గ కేంద్రంగానే సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం జరుగుతుంది. జిల్లా కేంద్రంలో నిర్వహించడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బోథ్ నియోజకవర్గ కేంద్ర బిందువు ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడలో సేవాలాల్ జయంతిని నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఉమ్మడి జిల్లా సీఆర్టీల సంపూర్ణ మద్దతు

ఉట్నూర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సీఆర్టీ ఉపాధ్యాయులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో ఆదివారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే భారీగా ఉద్యోగాల భర్తీ చేశామని తెలిపారు. గత పాలకులు ఉద్యోగులను పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. అనంతరం సీఆర్టీ ఉద్యోగులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రులు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఇందులో సీఆర్టీ ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వంశీ, రాష్ట్ర సలహాదారుడు కమలాకర్, జిల్లా సలహాదారుడు జాదవ్ శ్రీనివాస్, సుంగు మాజీ జిల్లా అధ్యక్షులు, ఉమ్మడి ఆదిలాబాద్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు శంకర్, విజేష్, ముని నాయక్, బద్దులాల్, బాపురావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కంది పంట ఎకరానికి ఆరు క్వింటాళ్ల కొనుగోలుకు ఆదేశాలు

బోథ్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కంది పంట ఆరు క్వింటాళ్ల వరకు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సహకార సంఘం డైరెక్టర్ జి. రాజు యాదవ్ తెలిపారు. గతంలో ఎకరానికి మూడు క్వింటాళ్ల 31 కిలో కొనుగోలుకు అనుమతి ఇవ్వడం జరిగిందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఎకరానికి ఆరు కుంటల వరకు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సోన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో మండల బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజి రెడ్డి, మల్కా కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, హరీష్ రెడ్డి, నర్సారెడ్డి, ప్రశాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు దయాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని లోకారి, మామిడిగూడ, పిప్పల్‌దరి గ్రామాల్లో పర్యటించి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పట్ట భద్రులను కోరారు. ప్రధాన నరేంద్ర మోడీ సుపరిపాలన చూసి ఓటు వేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు.



ఆదిలాబాద్ రూరల్ మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు దయాకర్, నాయకులు

ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు

కడెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆయా గ్రామాల్లో పోచమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద కడెం కన్నాపూర్ గ్రామ ప్రజలు తమ ఇంటి వద్ద నియమ నిష్టలతో బోనాలు వండుకొని నెత్తిన బోనం ఎత్తుకొని కన్నాపూర్ శివారులో గల పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలను చల్లగా చూడు తల్లి అని ఈ సందర్భంగా మహిళలు వేడుకున్నారు.



తాంసిలో పోచమ్మతల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

● **ఆలయాలకు భక్తులు బారులు**

తాంసి: చలి బోనాల పండుగను ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉదయం నుంచే గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. మేళ వాయిద్యాలతో తలపై బోనాలు పెట్టుకుని పోచమ్మ గుడిలోకి వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులను తీర్చుకుని పండుగ జరుపుకున్నారు. మండల కేంద్రంలో గ్రామమంతా ఒకేరోజు బోనాలు వేశారు. దీంతో గ్రామం సందడిగా కనిపించింది. కంపర్ల, పొన్నారి, హస్నాపూర్ గ్రామంలో కూడా ఒకే రోజు బోనాలు సమర్పించారు. మొత్తం మీద బోనాల సందర్భంగా గ్రామాలు ఆటపాటలతో కలకలలాడాయి.

● **కౌటా(బి)లో పెద్దమ్మ తల్లికి బోనాలు**

బోథ్: మండలంలోని కౌటా(బి) గ్రామంలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా బోనాలను శనివారం రాత్రి సమర్పించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు తలపై మట్టి కుండలో బోనాలు ఎత్తుకొని వాటిపై దీపాలను వెలిగించి పెద్దమ్మ తల్లి ఆలయానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.



కడెంలో పోచమ్మతల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



కౌటా(బి)లో బోనాలు ఎత్తుకొని వెళుతున్న మహిళలు

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి

● **హీరాసుక జయంతి వేడుకల్లో ఆదిలాబాద్ కలెక్టర్**

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో కలిసి జీవనం సాగించే వారు ఆదివాసీలని, వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ ఫలాలు వారికి అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం గోండి ధర్మ గురు హీరా సుక్క జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో హీర సుక్క దేవస్థానంలో ఆదివాసీ సంస్కృతీ ప్రకారం పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఎగరవేసి ఉద్యమ నాయకులు కొమురం భీం, కొమురం సూరు విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని కలెక్టర్ అన్నారు. వాటిని భావితరాలకు అందించేలా నాయకులు, సంఘ పెద్దలు కృషి చేయాలన్నారు. ఆదివాసీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. యంత్రాంగం కూడా వారికి ఫలాలను అందించేలా కృషి చేస్తుందని తెలిపారు. ఇటీవల నాగోబా జాతరను యంత్రాంగం విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. జిల్లాలో అటవీతో పాటు ఎస్టీ జనాభా కూడా ఎక్కువగా ఉందని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సివిన్ రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మెస్రం శంకర్, సిడాం రాం కిషన్, పూసం ఆనంద్‌రావు, మడావి దిగంబర్, సుభాష్, గేడం మాధవ్, సిడాం రవి, మహిళా నాయకురాలు ఆత్రం అనసూయ, గేడం భారతి బాయి, సామాజిక వేత్త ముడుపు మౌనిష్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

యాదవులు ఐక్యతతో ముందుకు సాగాలి

● **అఖిల భారత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

మావల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఐక్యతతో యాదవులు ముందుకు సాగుతూ రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అఖిల భారత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారామ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ అరిగేల నాగేశ్వర్ రావు, సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అసుర హన్మాండ్లు యాదవ్, మంచాల మల్లయ్య యాదవ్ లతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ దేశంలోని బీసీ జనాభాలో యాదవులు అత్యధిక జనాభా కలిగి ఉన్నారన్నారు. నూతనంగా ఏర్పడ్డ జిల్లా కార్యవర్గం జిల్లా యాదవ సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇందులో జిల్లా యాదవ సంఘం సీనియర్ నాయకులు అడ్వకేట్ కాస వేణి నారాయణ యాదవ్, గౌరవ అధ్యక్షులు గొర్ల రాజు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశన్న యాదవ్, జిల్లా ఎంప్లాయి అధ్యక్షుడు మహేందర్ యాదవ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ భీమన్న యాదవ, పండరి యాదవ్, విజయ బాబు యాదవ్, వేణు గోపాల్ యాదవ్, మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



నూతన యాదవ జిల్లా కార్యవర్గంలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాం యాదవ్

వేర్వేరుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



ఉట్నూర్ శిశు మందిర్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు



అర్లి(టి)లో సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉట్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం కలిసి మెలిసి చదువుకున్న విద్యార్థులు కలుసుకున్న రోజు. ఉట్నూర్ మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిరంలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ పాతిక సంవత్సరాల తర్వాత కలుసుకున్న అపూర్వ గట్టమిది. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థులందరూ ఒక దగ్గరికి చేరి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుని అప్పటి ప్రధానోపాధ్యాయులు నల్ల కిషన్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గొర్రెల నాగన్న, చిన్న రాజేందర్, మాధవ్ తదితర ఉపాధ్యాయులను సన్మానించారు.

భీంపూర్: మండలంలోని అర్లి(టి) గ్రామంలో జడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 2007-08 బ్యాచ్ విద్యార్థులు 17 ఏళ్ళు పూర్తి కావడంతో గురువులతో కలిశారు. వివిధ ప్రాంతల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటపాటలతో అలరించారు. అంతకు ముందు గురువులు, విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఒకరి ఒకరి యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు. అనతరం గురువులను శాలువా జ్ఞాపికలతో పాటు ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా ముగిసిన టీజీ సెట్ పరీక్ష

బోథ్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం టీజీసెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాఠశాల ముందు రోడ్డు నిండిపోయింది. అయితే రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 788 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 759 మంది హాజరయ్యారు మరో 19 మంది గైర్హాజరైనట్లు కళాశాల వర్గాల వారు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

ఆదిలాబాద్ రూరల్: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతితో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లోని మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష కొనసాగింది.ప్రవేశ పరీక్షకు 4వేల 198 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సమయం కంటే గంట ముందే చేరుకున్నారు. కాగా విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లోనికి అనుమతించారు. ఇదిలా ఉంటే పరీక్ష కేంద్రాలను డీసీవో ఎ.లలిత పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

● **హాల్ టికెట్ వచ్చినా.. పరీక్షకు దూరమైన విద్యార్థులు**

ముథోల్: గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేశారు. వారికి సైతం ముథోల్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. కానీ ఆదాయం సర్టిఫికెట్‌లో రూ.2 లక్షలకు ఎక్కువ ఉండడం, మరికొందరు విద్యార్థులు రెండుసార్లు అప్లై చేయడంలో రెండు సెంటర్లు రావడం, మరో ఇద్దరికీ సంబంధిత పేర్లు తప్పుగా నమోదు కావడంతో నలుగురు విద్యార్థులు పరీక్ష రాయలేక పోయారు. గంపెడు ఆశతో వచ్చిన చిన్నారులు నిరాశ చెందారు. ఈ విషయమై సంబంధిత పరీక్ష సెంటర్ ప్రిన్సిపాల్‌కు వివరణ కోరగా.. సంబంధిత నలుగురు విద్యార్థులకు సంబంధించి హాల్ టికెట్ మీద ఒక పేరు, కుల ధ్రువీకరణ పత్రం మీద ఒక పేరు, ఒక విద్యార్థికి ఎక్కువ ఆదాయం ఉన్నట్లు, మరొక్క విద్యార్థి రెండు సార్లు వేరే వేరే సెంటర్ల పేరుతో అప్లై చేయడం వలన వారి పేర్లు రిజక్ట్ అయ్యాయని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా వివరించారు.

● పరీక్ష రాయకుండ ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



ఏకగ్రీవం చేసినా.. ఏమిలాభం?

(5వ పేజీ తరువాయి...)

ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కూడా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను విడుదల చేయలేదు.

నిలిచిపోయిన నిధులు

గ్రామ పంచాయతీలకు సకాలంలో కేంద్ర ప్రభుత్వం నిదులు విడుదల చేస్తుండగా.. 25 శాతం నిధులు పారిశుద్ధ్యానికి, 25 శాంత తాగునీటి అవసరాలకు కేటాయించి 50శాతం నిధులను ఇతర ఇతర పనులకు కేటాయించారు. రాష్ట్ర నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామీణ ప్రాంతాల సర్పంచ్‌లు అప్పులు చేసి కాలం నెట్టుకొచ్చారు. మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మురికి కాలువల పనులు, సిమెంట్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, తదితర పనులకు అప్పులు చేసి ప్రభుత్వం నిధుల కోసం ఎదురుచూసినా.. మాజీలకు నేటి వరకు నిధులు రాలేదు. గ్రామాల ప్రథమ పౌరులుగా ఉండి అప్పుల పాలు అయ్యామే తప్ప తమ గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు.

ప్రత్యేక పాలనలో అన్నీ సమస్యలే..

గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అయినా.. ప్రభుత్వం అన్ని గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులు కేవలం గ్రామాలను సందర్శించి వెళ్తున్నారు తప్ప.. గ్రామాల సమస్యలు పరిష్కరించడానికి తమ దగ్గర నిధులు లేవని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. ఆయా పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులు చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతూ పంచాయతీల అవసరాల కోసం అప్పుల పాలు కావాల్సి వస్తుందని గ్రామపంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. సకాలంలో పంచాయతీ సెక్రెటరీలకు సైతం వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.

ఎన్నికలు త్వరగా నిర్వహించాలి

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎన్నికలు త్వరగా నిర్వహిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు అంటున్నారు. గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వనందున.. ఈ సారి జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఎవరు కూడా ఏకగ్రీవం వైపు చూపరని ప్రజలు కోరుకుంటున్నారు.



దొంగల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

వైన్స్ షాప్ దొంగల అరెస్టు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని ఈశ్వర్ నగర్ గ్రామ సమీపంలోని ఉన్న జైదుర్గా వైన్స్ షాపులో చోరీకి పాల్పడిన నిందితులను స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆదివారం పట్టుకుని అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవలే మండలంలోని ఈశ్వర్ నగర్ గ్రామ సమీపంలోని ఉన్న జై దుర్గా వైన్ షాపుతో పాటు ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్, మావల, తలమడుగులో కిరాణ దుకాణాలు,పక్క జిల్లా కరీంనగర్, కొడిమియల్, తదితర ప్రాంతాల్లో వరుస దొంగ తనాలకు పాల్పడిన ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్, దుర్గానగర్‌లో నివాసముంటున్న సుఖ్‌దేవ్(25), ఆర్.గజానంద్(21), టి.కృష్ణ(20), బి.ఆకాష్(19)లను మండల కేంద్రంలోని అందునాయక్ చౌరస్తా వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. వీరి వద్ద ఒక వీలర్ బైక్‌తో 2,200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెన్షన్

సిరికొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సిరిచెల్మ టైగర్ జోన్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి, సిరికొండ అటవీ సెక్షన్ అధికారి ఎ.గీరయ్య సస్పెండ్ అయినట్లు సిరిచెల్మ టైగర్‌జోన్ అటవీక్షేత్రాధికారి నాగవత్ స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆరు నెలల క్రితం సిరికొండలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను గీరయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన కలప వివరాలను దాచిపెట్టి, తప్పుడు వివరాలను నమోదు చేయడంతో పాటు నిందితులపై కేసులు నమోదు చేయకపోవడంతో బాసర జోన్ సీసీఎఫ్ శర్వానంద్ ఆధ్వర్యంలో గత వారం క్రితం విచారణ చేపట్టారు. అక్రమంగా కలప, ఇసుకను తరలిస్తున్న స్మగ్లర్లతో చేతులు కలిపి మామూళ్లు తీసుకుంటూ అవినీతికి పాల్పడడంతో సదరు అధికారిని సీసీఎఫ్ శర్వానంద్ సస్పెండ్ చేసినట్లు అయన తెలిపారు. దీంతో ప్రస్తుతం సిరికొండ సెక్షన్ తాత్కాలిక అధికారిగా సాత్మోరీ బీట్ ఆఫీసర్ ఆడె సంతోష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

● **చికిత్స పొందుతూ ఒకరి మృతి**

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి 11:30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణానికి చెందిన సంతోష్, జి. గౌతమ్ అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎస్సై సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో సంతోష్ చికిత్స పొందుతూ నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడు. జి. గౌతమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అన్నయ్య జి.కాశీనాథ్ తన తమ్ముడికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా.. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

హత్యాయత్నం చేసిన బాల నేరస్తుడు, మరొకరి రిమాండ్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి తండ్రి వివాహానికి నిరాకరించాడన్న ఆరోపణలతో బాల నేరస్తుడు, అతనికి సహకరించిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. అజీజ్ అనే వ్యక్తిని కడుపులో కత్తెరతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డట్టు బాధితుడి భార్య చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసి 24 గంటల్లో చాకచక్యంగా వారిని పట్టుకున్నట్టు వెల్లడించారు. కాగా, బాల నేరస్తుడికి సహకరించిన మొహమ్మద్ తౌసీఫుల్లా షైక్‌సాబ్‌పేట నివాసి అని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి మృతి

భైంసా రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామోల్ గ్రామంలో హంపోలి ప్రభాకర్ రెడ్డి ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హంపోలి ప్రభాకర్ రెడ్డి(42) అనే వ్యక్తి తాగుడికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది రాత్రి తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై మాలిక్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఉట్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కెటిపేటలో ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఉదయం 9.30 గంటలకు లక్కెటిపేట్ గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య అనే రైతు ఇంట్లో ఎవరు లేని సమయంలో కరెంటు షాక్‌తో అగ్ని ప్రమాదం జరగగా.. ఇల్లు మొత్తం దగ్ధం అయ్యిందని ఆదివాసీ సంఘర్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది రామారావు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పి వేశారని తెలిపారు. ఏఎస్సై రామయ్య సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కాగా, రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిసింది.



భక్తుల చందాలతో నూతనంగా నిర్మించిన ఆలయం ఇదే..

ముస్తాబైన శివాలయం

● నేడు శివపార్వతుల కల్యాణం

బోథ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో వంద సంవత్సరాల క్రితం వెలసిన శివాలయంలో శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణానికి గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

● అందరి సహకారంతో ఆలయం

వంద సంవత్సరాల క్రితం వెలిసిన ఈ ఆలయంలో ప్రతీ సంవత్సరం పూజా కార్యక్రమాల నిర్వహించేవారు. ఈ ఏడాది భక్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

● రహదారి ఏర్పాటు

మండలంలో ఏకైక శివాలయం ఉండడంతో దీని అభివృద్ధికి చిలుకూరి నరేందర్ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. అయితే ఆలయానికి వెళ్లే రహదారిని దాతల సహకారంతో వాహనాలు వెళ్లే విధంగా సిద్ధం చేశారు. రెండు కిలోమీటర్ల రోడ్డును సిద్ధం చేయడంతో భక్తులకు రాకపోకలకు ఇబ్బందులు కూడా అయిపోయాయి.

● దాతల సహకారంతో..

గ్రామంలోని దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. భవిష్యత్తులో మరింతగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని గ్రామస్థులు, దాతలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పురాతనమైన శివాలయం ఆలయం దాతల సహకారంతో వెలుగులోకి వస్తోంది.



ఆలయానికి వెళ్లే రహదారి

పురాతన ఆలయం

● ఎర్రన్న, గ్రామస్థులు



తమ గ్రామం సమీపంలో ఉన్న శివాలయం వందల సంవత్సరాల నుంచి ఉంది. శివలింగం ఎప్పుడు ప్రతిష్ఠాపించిందో తెలియదు. కానీ తమ పూర్వీకులు చెప్పిన దాని ప్రకారం వందల సంవత్సరాలు క్రితం వెలిసి ఉంటుందని చెప్తుంటారు.

ఆలయం కోసం భూమి ఇచ్చా..

● ఆలయ భూదాత బిజ్జూరి గంగారెడ్డి



పురాతనమైన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేద్దామని గ్రామస్థులు ముందుకొస్తే నా వంతుగా భూమిని విరాళంగా ఇచ్చాను. ఈ ఏడాది శివపార్వతుల కల్యాణం జరుపుతున్నాం. నాయకులు నిధులు కేటాయిస్తే రహదారి ఇబ్బందులు తొలిగిపోతాయని పేర్కొన్నారు.



వందేళ్ల క్రితం ప్రతిష్ఠించిన లింగం

పంచాయతీలకు నిధుల కటకట!

ఫోకస్



పంచాయతీ రాజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు (ఫైల్)

● స్థానిక ఎన్నికలతో కేంద్రం లంకె ● పైసా విదల్చని రాష్ట్ర ప్రభుత్వం
● సొంత గ్రాంటూ విడుదలకు కలగని మోక్షం ● జేబుల్లో నుంచి చెల్లించేందుకు కార్యదర్శుల నిరాకరణ

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుంటున్నాయి. ఇంతకాలం చిన్న ఖర్చులకు జేబుల్లోంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. ఫలితంగా గ్రామాల్లో వీధి దీపాలు వెలుగకపోయిన, ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయినా, వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యదర్శులు సొంతంగ వెచ్చించిన ఖర్చులు తిరిగి రాకపోగా నగదు చెల్లించకుండా సామగ్రిని షాపు నిర్వాహకులు ఇచ్చేందుకు నిరాకరిస్తుండడంతో పనులు అన్నీ నిలిచే పరిస్థితులు నెలకొన్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వని కేంద్రం

ప్రతీ గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తోంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సి ఉంది. పంచాయ తీల్లో పాలకవర్గాలు లేనందున నిధులు విడుదల చేయ లేమంటూ కేంద్రం చేతులెత్తేసింది. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఉంటే కేంద్రం నిధులు సక్రమంగా విడుదలై ఉండేవి. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిన దాదాపు రెండేళ్లు గడవవస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంలో తాత్సారం చేస్తోంది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిన తరువాత అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ జరుగుతుండడంతో పంచాయతీ ఎన్నికల నిర్వాహణ జరగలేదు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు ఆటంకం ఏర్పడింది.

ఎన్నికల తర్వాతే ఫండ్

పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే ఫండ్ రిలీజ్ చేస్తామని కేంద్రం లంకె పెట్టడంతో ఆ నిధులపై ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) కింద రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫండ్ కూడా రాకపోవడంతో గ్రామాల్లో నిధుల కొరత తీవ్రరూపం దాల్చింది. కేంద్ర గ్రాంటు 2024 ఆగస్టు నుంచి నిలిచి పోగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు 2023 ఆగస్టు నుంచి నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామ జనాభాలోని తలా ఒక్కరికి రూ.108 చొప్పున విడుదల చేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిలో పయణిస్తోంది.

జనరల్ ఫండ్ విడుదలకూ అడ్డంకి..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు నిలిపి వేయగా సొంతంగ జమ చేసుకున్న ఫండ్‌ను కూడా వినియోగించుకోలేని దీనమైన పరిస్థితులు నెల కొన్నాయి. గ్రామాల్లో వసూలు చేసే ఇంటి పన్నును కార్యదర్శులు ట్రెజరీ కార్యాలయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. ఆ నిధులు అవసరమైనప్పుడు కార్యదర్శులు చెక్కులు డిపాజిట్ చేయడం ద్వారా తిరిగి డ్రా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 467 గ్రామపంచాయతీలు ఉండగా ట్రెజరీలలో పంచాయతీ కార్యదర్శులు జమ చేసిన మొత్తం సుమారు రూ.3.5 కోట్లు వరకు ఉంటుందని అంచనా. ఆ నిధులను కార్యదర్శులు డ్రా చేసి గ్రామాల్లో అవసరమైన వాటికి ఉపయోగిస్తారు. ఆరు నెలలుగా అంటే ఆగస్టు 2024 నుంచి జనరల్ ఫండ్ నిధులు కూడా విడుదల కావడం లేదని చెబుతున్నారు.

వసూలు సొమ్ము ఫ్రీజ్

ఒకవైపు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు విడదల చేయకపోగా మరోవైపు తాము వసూలు చేసి డిపాజిట్ చేసిన సొమ్ము ఫ్రీజ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో గ్రామ అవసరాల నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు సొంతంగా జేబుల్లోంచి వెచ్చిస్తున్నారు. మరికొంత దుకాణాల్లో ఖాతాలు పెట్టడం ద్వారా నెట్టుకొస్తున్నారు. గ్రామ అవసరాల కోసం జిల్లావ్యాప్తంగా కార్యదర్శులు ఇప్పటికే సుమారు రూ.లక్ష వరకు వెచ్చించినట్లు తెలుస్తోంది. ఇక మీదట సొంతంగ చెల్లించే స్థోమత తమకు లేదనే అభిప్రాయంతో ఉన్న కార్యదర్శులు పంచాయతీల నిర్వాహణ చేపట్టేందుకు నిరాకరిస్తునట్లు సమాచారం.

నిధుల విడుదలకు వినతి

గ్రామపంచాయతిల్లో ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులతో పాటు వివిద పనుల నిర్వాహణ కోసం నిధులు విడుదల చేయాలని కోరుతూ తెలంగాన పంచాయత్ సెక్రటరీస్ ఫోరం ఆద్వర్యంలో హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమీశనర్ శ్రీజనకు వినతీ పత్రం అందజేశారు. పంచాయతీల్లో పాలక వర్గం కాల పరిమితి ముగిసిసిన నాటి నుండి రోజు వారి పారిశుద్యం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించడం, వాటికి మరమ్మత్తులు, బ్లీచింగ్, బయోటిక్స్, ఫాగింగ్ తదితర సామాగ్రి కోసం దుఖానాల్లో ఖాతాలు పెట్టామని, మళ్లీ సామాగ్రి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లీయర్ చేయించడంతో పాటు ట్రెజరికి అనుసందానం లేకుండా నేరుగ చెల్లింపులు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో మార్చి ఒకటవ తేది నుంచి పంచాయతీల నిర్వహణ చేపట్టలేమని స్పష్టం చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ లోగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తేనే పంచాయతీల నిర్వహణ సక్రమంగా జరిగే అవకాశాలున్నాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు జఠిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తొలి పూజ గిర్జాయి మాతకే..!

● అక్కడ ఏ పని చేయాలన్నా అమ్మవారికి పూజ చేశాకే ప్రారంభం ● శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయం
● మహా శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు ● ఎమ్మెల్యే చొరవతో ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు

భక్తి



గిర్జాయి మాత ఆలయం



ఆలయంలో గిర్జాయి మాత విగ్రహాలు

భీంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలతో పాటు ఇతరులు సైతం అక్కడ దర్శనం చేసుకొనిదే ఏ పని ముట్టుకోరు ఆ దేవతకంత ప్రత్యేకత ఉంది. భీంపూర్ మండలంలోని గొల్ల గడ్ పెన్ గంగ నది ఒడ్డున వెలసింది. ఆ దేవత ప్రతీ శివరాత్రి ఉపవాసాలు ఉండి అక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏదైనా పని చేయాలంటే అక్కడ ముందు పూజలు చేశాకే పనులను ప్రారంభిస్తారు. వ్యవసాయ రైతులు వారి పనులు చేపట్టలంటే ముందుగా అక్కడికి వెళ్లి గిర్జాయి (పార్వతి దేవి) మాతను దర్శించుని కొని పనులను ప్రారంభిస్తారు. మహా శివరాత్రి పర్వదినాన గిర్జాయి మాతా దర్శనం కోసం మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల నుంచి వందలాది మంది వచ్చి పూజలు నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధికి ఈ ప్రాంత వాసులు కృషి చేస్తున్నారు. నీటి సౌకర్యం కోసం బోరు బావిని దాతలు వేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సంప్రదించి రోడ్డు సౌకర్యం కల్పించుకున్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం అన్ని వాహనాలు వచ్చి పోయేలా మట్టిరోడ్డును వేశారు. మహాశివరాత్రి పర్వదినాన గిర్జాయిమాతా దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. గుడి వద్ద అన్ని ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. భీంపూర్ మండలంతోపాటు తాంసి, తలమడుగు, ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్థానికి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ చొరవతో షెడ్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

చాలా పురాతన ఆలయం

● నైతం కాశీరాం, గొల్లగట్ వాసి



నేను పుట్టిక ముందు నుంచే ఈ ఆలయం ఇక్కడ వెలసింది. కింది పెన్ గంగలో స్నానం చేసి భక్తులు పూజల్లో పాల్గొంటారు. గిర్జాయి మాతాకు కట్న కానుకలు సమర్పిస్తారు. ఈ గుడిని అభివృద్ధి చేస్తే బాగుంటుంది.




గిరిజాయి మాతా మా ఆరాధ్య దైవం

● వినోద్ గుంజల వాసి

తాతల నాడు పెన్‌గంగా ఒడ్డున వెలసిన గిరిజయి మాతా ఆదివాసీలకు ఆరాధ్యదైవం దేవిని నమ్మినవారికి అంతా మంచే జరుగుతుందని మా పెద్దలు చెప్తారు. ఇంతటి పురాతన క్షేత్రాన్ని ఎవ్వ పట్టించుకోలేదు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక శ్రద్ధతో సరిహద్దు గొల్లగడ్ నుంచి గుడి వరకు రోడ్డు వేయించారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిపోయే భక్తులకు మంచి సౌకర్యం కలిగింది. శివరాత్రి పండుగ వేళ పూజలు నిర్వహించనున్నాం. మహా శివరాత్రి జాతరకు కూడా ఎమ్మెల్యే సహకరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే కృషితో ఈ క్షేత్రం అభివృద్ధి అవుతుందన్న విశ్వాసం మాకు ఉంది.

ఫొటో న్యూస్



కనువిందు చేస్తున్న మాఘమాసపు

ప్రకృతి అల్లిన హరివిల్లు!

ఆకులు రాలి.. పూలతో విరబూసిన అడవి అందాలు



తలమడుగు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అల్లుకున్న హరివిల్లు ఎంత అందంగా ఉంటుందో ఈ చిత్రాలు చూపిస్తున్నాయి. ఎండలు ముదేరే కొద్ది అడవి క్రమంగా ఎర్రబడుతుంది. అయితే చెట్ల ఆకులన్నీ ఎండిపోయినా ప్రకృతి ఎప్పుడు పచ్చగానే ఉంటుందనడానికి ఈ చిత్రాలే నిదర్శనం. వర్షాకాలంలో చెట్లు పచ్చగా కనిపిస్తే మండు వేసవిలో కొన్నిరకాల చెట్లు వివిధ రంగుల్లో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో కోశాయి, ఖండాల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్, వంటి అడవుల్లో ప్రకృతి ఇలా హరివిల్లును కనువిందు చేస్తోంది. ఈ ఫొటోలను ప్రముఖ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆయన కెమెరాల్లో బంధించాడు. ఈ ప్రకృతి అందాలను మరింత అభివృద్ధి పరిస్తే అందమైన అడవుల ఆదిలాబాద్ జిల్లా మరింత పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయి ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.








● తలమడుగు మండలం కోసాయి అడవి ప్రాంతంలో మండుతున్న ఎండలకు ఆకులు రాలి విరిగపూసిన పూలతో కనువిందు చేస్తున్న ప్రకృతి హరివిల్లు అందాలు

గురుకుల ప్రవేశ పరీక్షా కేంద్రం తనిఖీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న గురుకుల ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. గదులు సందర్శించి పరీక్ష నిర్వహణ తీరు పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లు వైద్యశిబిరంలో మందుల అందుబాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్ష పూర్తికి అధికారులను ఆదేశించారు.




ఏకగ్రీవం చేసినా.. ఏమి లాభం?


మత్తడిగూడ గ్రామం

- జిల్లాలో ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు అందని ప్రోత్సాహక నిధులు
- ఆందోళన చెందుతున్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు
- సమీపిస్తున్న పంచాయతీ ఎన్నికలు
- ప్రత్యేక అధికారుల పాలనలో తప్పని తిప్పలు
- జిల్లావ్యాప్తంగా 2018-19 ఎన్నికల్లో మొత్తం 162 పంచాయతీలు ఏకగ్రీవం

ఉట్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని భావించిన ప్రజల ఆశలు ఎండమావులే అయ్యాయి. గ్రామాలకు నిధులు వస్తే గ్రామాల అభివృద్ధికి వినియోగించవచ్చని భావించిన ప్రజలకు ప్రభుత్వం నిరాశనే మిగిల్చింది. పంచాయతీలకు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కానీ సర్పంచ్‌లకు పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ.. ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 2013-14 సంవత్సరంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒకొక్క ఏకగ్రీవ పంచాయతీకి రూ.9.20 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందించడంతో అదే ఆశతో గ్రామీణులు 2018-19లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 162 గ్రామ పంచాయతీలకు ప్రజలు సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో 18 మండలాలు ఉండగా.. ఆదిలాబాద్ అర్బన్ మండలం మినహా అప్పటి 17 మండలాల్లో 468 గ్రామ పంచాయతీలు కాగా, ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు నిలిచిపోవడంతో 467 గ్రామ పంచాయతీలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు.


మత్తడిగూడ గ్రామపంచాయతీ కార్యాలయం

162 పంచాయతీలు ఏకగ్రీవం

జిల్లాలో 162 పంచాయతీలకు ప్రజలు సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉట్నూర్ మండలంలో 35 గ్రామ పంచాయతీలకు గాను నర్సాపూర్(జె), చెరువుగూడెం, మారుగూడ, శ్యాం నాయక్ తండా, తాండ్ర, బాబాపూర్, లక్కెటిపేట, కమాయిపేట, మత్తడిగూడ, కన్నాపూర్, ఘన్‌పూర్, గంగాపూర్, సాకేరా, చింతకర్ర, జమాలీతండా, కుమ్మరి తండా, ఇంద్రవెల్లి మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను దేవాపూర్, హరకపూర్ తండా, మెండపల్లి, పిప్రి, పిట్ట బొంగరం, సమ్మక, తుమ్మగూడ, ఏమాయకుంట, గట్టేపల్లి పంచాయతీలు, నార్నూర్ మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా బేతాల్‌గూడ, గంగాపూర్, జండా, ఖైర్ దాటువా, కంపూర్, మహాగావ్ పంచాయతీలు, గాదిగూడ మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉండగా.. కాండో, కొనికాస, లోకారి(బీ), రాంపూర్, రోమన్ కాసా, సాంగ్వి(బీ) పంచాయతీలకు గిరి జనులు సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదే మాదిరి ఆదిలాబాద్ మండలంలో చించుగాట్, పెద్దమాలే బోరేగాం, దిమ్మ, లోహార, ఖండాల, యశ్వంత్ గూడ, చిట్యాల బోరి, హత్తిఘాట్, తిప్ప, చించుదరి, అల్లికోరి, అసోదా, బజార్‌హత్నూర్ మండలంలో 11, బేల మండలంలో 7, భీంపూర్ మండలంలో 15, బోథ్ మండలంలో 11, ఇచ్చోడ మండలంలో 5, గుడిహత్నూర్ మండలంలో 9, జైనథ్ మండలంలో 6, నేరడిగొండ మండలంలో 16, సిరికొండ మండలంలో 9, తలమడుగు మండలంలో 16, తాంసి మండలంలో 8 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు అందించాల్సి ఉండగా.. గతంలో ఉన్న ప్రభుత్వం పోయి తెలంగాణ రాష్ట్రంలో



ప్రోత్సాహక నిధులు వెంటనే ఇవ్వాలి

: పంద్రా లత, మాజీ సర్పంచ్, ఘన్‌పూర్



రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను అందజేస్తుందని భావించి ప్రజలు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కానీ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వక కాలయాపన చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రోత్సాహక నిధులను వెంటనే ఇవ్వాలి.

చివరకు అప్పులు మిగిలాయి..

: మడావి యశోదా బాయి, మాజీ సర్పంచ్, మత్తడిగూడ



సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక నిధులను విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులను చేశాం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వక సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేసింది. నిధులతో పాటు పెండింగ్ బకాయిల బిల్లులు వెంటనే చెల్లించాలి.

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది

: రాంప్రసాద్, ఎంపీడీవో, ఉట్నూర్



జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన పలు గ్రామాల సర్పంచ్‌లకు ప్రోత్సాహక నిధులు రావాల్సి ఉంది. అయితే, వీటికి సంబంధించి నిధులు ఎప్పుడు వస్తాయో? చెప్పలేం. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రభుత్వాలు మారినా.. పాలన మారలేదు

- ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ • బీజేపీ బలపర్చిన వారికే పట్టం కట్టండి • కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి


తలమడుగులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు, నాయకులు మారినా.. పాలన మాత్రం మారలేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, పాల్వాయి హరీశ్ బాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో విసుగు చెందిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్‌ను అనుసరిస్తు ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఏకైక జాతీయ పార్టీ బీజేపీ అని తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానం నుంచి పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 14 నెలల కాలం పూర్తయినా.. ఇప్పటి వరకు ప్రజలు, కార్మికులు, రైతులకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఇచ్చిన హామీలు.. హామీలుగానే ఉన్నాయన్నారు. బీజేపీ పాలించిన అనేక రాష్ట్రాల్లో రెండు, మూడు సార్లు అధికారం చేపట్టిందని గుర్తు చేశారు. శాసన మండలిలో ప్రజల సమస్యలపై గళం విప్పడానికి పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా అభ్యర్థించారు.

• సెంట్రల్ లైబ్రరీని సందర్శించిన కిషన్ రెడ్డి


ఆదిలాబాద్‌లోని సెంట్రల్ లైబ్రరీలో పట్టభద్రులతో మాట్లాడుతూ..

ఆదిలాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని సెంట్రల్ లైబ్రరిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులతో కాసేపు ముచ్చటించారు. లైబ్రరీలో నెలకొన్న పలు సమస్యలను కేంద్ర మంత్రికి అభ్యర్థులు విన్నవించారు. వాటిని త్వరతగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

• కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి

తలమడుగు: కేంద్రం అందిస్తున్న నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచడంలో పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉండం గ్రామ శివారులో గల ఆయుష ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆయన జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. దానికి నిదర్శనమే ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కి వెళ్లే జాతీయ రహదారి నిర్మాణమే అని గుర్తు చేశారు. అదేవిధంగా తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను అందిస్తున్నారు. ఈనెల 27న నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, సుహాసినిరెడ్డి, తాటిపెల్లి రాజు, వెంకటస్వామి, కనపర్తి చంద్రకాంత్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, మహేందర్ యాదవ్, ధనుంజయ్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాల నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నూతనంగా హనుమాన్ వ్యాయామశాల నిర్మిస్తున్నారు. ఆదివారం సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొని భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు విక్రమ్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి గంగయ్య, సభ్యులున్నారు.

రేపు ఉట్నూర్‌కు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ రాక

ఉట్నూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలకేంద్రానికి 25న మంగళవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం రానున్న నేపథ్యంలో మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున ఇంటికి ఒకరు డప్పులతో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బిరుదుల లాజర్ అన్నారు. మండలంలోని పులిమడుగు, హస్నాపూర్, శ్యాంపూర్‌లో ఆదివారం మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేసినందుకు కృతజ్ఞతగా మాదిగ, మాదిగ ఉప కులాల ఆధ్వర్యంలో ఈనెల 25న ఉట్నూర్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభకు మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు డప్పు తీసుకొని ఈ సభలో పాల్గొని సీఎంకు కృతజ్ఞతగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించే సభలో పాల్గొనాలని, అలాగే తమ సమస్యలను సైతం కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేకు తెలపాలన్నారు. ఇందులో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు బిరుదుల లాజర్, అరకిఇల్లా అశోక్, ప్రభాకర్, కుంటే లక్ష్మణ్, ఎస్.కృష్ణ, లక్ష్మి, కే.శ్యామల, కావడ్కర్ దత్త మహరాజ్, తొగ్రే అశోక్, వాగ్మారే ఉత్తమ్, కావడ్కర్ నగ్నత, కె.అంకుష్, జాదవ్ రాజేష్, దుగ్గమ్మ, మాదిగ సంఘం, మాంగ్ సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బోథ్: ఈనెల 25న ఉట్నూర్‌కు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం రానున్నట్లు ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్త్రారు లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయనను ఘనంగా స్వాగతించేందుకు మాదిగ, ఉప కులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గం పరిధిలోని మాదిగలు తరలిరావాలని కోరారు. ఆయన వెంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్యాల అంజయ్య, గుడి యాత్ర మండల అధ్యక్షుడు దుబ్బాక నరేష్, నడికుంట ఆశన్న, తదితరులు ఉన్నారు.